క్లుప్తంగా

ఎంపీకి ఘన స్వాగతం



జనగామ: రైతు రుణమాఫీ నేపథ్యంలో జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డికి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మాజీ మున్సిపల్, మార్కెట్ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు తదితరులు ఉన్నారు. కాగా, కిరణ్‌కుమార్‌రెడ్డి గానుగుపహాడ్‌కు వస్తూ పెంబర్తి వద్ద కాసేపు రైతులతో ముచ్చటించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరునెలల్లో రైతు రుణమాఫీ చేసి మాటనిలబెట్టుకున్నారు.

సోమయ్యకు ప్రశంసపత్రం



దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన సామాజిక కవి, రచయిత అంకాల సోమయ్య తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ బాలాచారీచే ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్ రవీంద్ర భారతిలో గీతా ఫౌండేషన్, తెలుగు భాషా చైతన్య సమితి, స్పోర్ట్స్ ఫౌండేషన్-శ్రీ ఫైన్ ఆర్ట్స్ వారి సౌజన్యంతో జరిగిన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వైభవం-కవితా సంకలన ఆవిష్కరణ సభలో అంకాల సోమయ్యకు ప్రముఖ కవి, రచయిత గంటా మనోహర్ రెడ్డి, నంది అవార్డు గ్రహీత డాక్టర్ సాధనాల వెంకటస్వామినాయుడు తదితరులతో ఘనంగా సత్కారం లభించినట్టు తెలిపారు.

పిచ్చి మొక్కల తొలగింపు



చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో సర్వే నంబరు 70లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యాన భూమిలో ఎర్ర జెండాలు పాతి, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పైస రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మల్లేషం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యుడు మోతె లింగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, మండల సహాయ కార్యదర్శి బోనగిరి కుమారస్వామి, కట్ట ఎల్లయ్య, దామెర సంపత్, బీకేఎంయూ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల కుమార్ భూకమిటీ నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండ గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని స్థానిక పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ ముస్క రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మీదికొండ గ్రామంలో అందె ఆంజనేయులు ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న అందె ఆంజనేయులు, గుర్రం ప్రభాకర్, జోగి యాకుబ్, జోగు రాజు, జోగు బాబు, గాదె కుమార్‌లను అరెస్టు చేసి రూ.5,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మగడ్డతండాలో చోరీ

దేవరుప్పుల: ఎవరు లేనిది చూసి తాళం పగులగొట్టి ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి ధర్మగడ్డతండాలో జరిగింది. ఏఎస్సై సదానందం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మగడ్డతండాకు చెందిన మూఢ జగ్‌రామ్ కుటుంబ సభ్యులు గురువారం హైదరాబాద్ వెళ్లారు. రాత్రి ఇంట్లో ఎవరు లేనిది చూసి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలతో నగదు రూ.5 వేలు దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా, గురువారం పక్కింటివారు తలుపులు తెరిచి ఉన్న విషయం జగ్‌రామ్‌కు సమాచారం అందించడంతో దొంగతనం వెలుగు చూసింది. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించినట్టు పేర్కొన్నారు.

ఊరూరా రుణమాఫీ సంబురాలు



జనగామ: వైఎస్సార్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



పాలకుర్తి టౌన్: ఎడ్ల బండిపై ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



బచ్చన్నపేటలో..



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన ఎంపీ కడియం కావ్య తదితరులు

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల/తరిగొప్పుల/బచ్చన్నపేట/నర్మెట/చిల్పూరు/లింగాలఘణపురం/జఫర్‌గఢ్/కొడకండ్ల/పాలకుర్తి టౌన్/పాలకుర్తి: రైతు రుణమాఫీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు గురువారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాడు వైఎస్సార్.. నేడు రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు ఇచ్చిన మాట మేరకు పంట రుణ మాఫీ చేస్తూ బాసటగా నిలుస్తుందని అన్నారు. కాగా, చాగల్లు, నెల్లుట్లలో నిర్వహించిన సమావేశాల్లో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి పేదలు, రైతుల సమస్యలు పట్టవని, వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి ఎగ్గొట్టే బడా పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైన, చారిత్రాత్మకమైందన్నారు. పాలకుర్తిలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ రైతుల రుణమాఫీలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అధికారులు మాట్లాడుతూ రుణమాఫీ డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు.



చిల్పూరు: బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు



తరిగొప్పుల: వీడియోకాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న అధికారులు, రైతులు

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి



షాకీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్‌లు

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ అభయహస్తంలో ఇచ్చిన హామీలో భాగంగా ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లో చేర్చాలని మత్స్య కార్మిక పారిశ్రామిక సహకార సంఘం జిల్లా చీఫ్ ప్రమోటర్ నీల రాజు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు నీల గోపాల్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ముదిరాజ్‌లు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మత్స్య కోఆపరేటివ్ ఫెడరేషన్‌కు ఎన్నికలు జరిపి చైర్మన్, పాలక మండలిని నియమించాలని, ముదిరాజ్‌లకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ వంద శాతం మత్స్యకార్మికులకు చేరే విధంగా చూడాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నాయబ్ తహసీల్దార్ షాకీర్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ పిట్టల రాజు, ప్రచార కార్యదర్శి నీల రమేష్, ఆయా గ్రామాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

రామస్వామి ఆశయాలు కొనసాగిద్దాం..



నివాళులర్పిస్తున్న కనకారెడ్డి తదితరులు

నర్మెట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సీపీఎం సీనియర్ నాయకుడు మాచెర్ల రామస్వామి మృతి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. అనారోగ్యంతో రామస్వామి గురువారం మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి పార్థివదేహంపై పార్టీ జెడాను కప్పిన అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇరుగు కృష్ణమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పలు పోరాటాల్లో పాల్గొని పేదల పక్షాన నిలిచిన ఆయన సేవలు మరువలేనివని, మరణం పార్టీకి తీరనిలోటని సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు, కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, చుంచు విజేందర్, ధర్మభిక్షం, ప్రజ్ఞాపురం నర్సింహులు, కూరాకుల శ్రీను, గుండెల్లి రాజు, పాండ్యాల అంజయ్య, కాల్వ రాములు ,గొల్లపల్లి బాలరాజు, సత్తయ్య, నరహరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ బోధన



చిన్నారులతో ఆటలు ఆడిస్తున్న టీచర్లు



బచ్చన్నపేట: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కవిత

లింగాలఘణపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రీస్కూల్ బోధన తప్పని సరిగా ఉంటుందని, ఆటలు, పాటలు, కథలు, ఇంగ్లిష్ మీడియంలోనే ఉంటాయని పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సీడీపీఓ రామాదేవి కోరారు. గురువారం మండలంలోని నెల్లుట్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆట, పాటలు ఆడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, శ్రీలత, సురేఖ, మారుతి, పద్మావతి, సుల్తానా, ఆయాలు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

బచ్చన్నపేట: చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కవిత, మనోహర అన్నారు. మండలంలోని గోపాల్‌నగర్, ఇటుకాలపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు కనకలక్ష్మి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆయాలుపిల్లలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో కేబీఆర్ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి హాజరై 47 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ రూ.47,05,452 చెక్కులను, అదేవిధంగా 20 మందికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు రూ.4,58,500 విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కడియం కావ్య మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినయలత, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, డీటీ షకీర్, ఆర్ఐ కిశోర్, ఎంపీఓ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: మండలంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా చెక్కులు అందజేయనున్నట్లు తహసీల్దార్ పురం యుగేందర్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ రోడ్డులోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో చేరుకొని చెక్కులు పొందాలని ఆయన సూచించారు.

పరిశుభ్రత పాటించాలి



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వర్షాకాలంలో వేడిచేసి చల్లార్చిన నీటిని తాగుతూ, వేడివేడి పదార్థాలను తినాలని సూచించారు. కళాకారులు బానోత్ గణేష్, సంజీవ, శంకర్, శ్రీనివాస్, సోమయ్య, కనకరాజు, చంద్రశేఖర్, రతన, స్వప్న, మమత, రంజాన్‌బీ, పద్మ, చామంతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత డ్రగ్స్, మత్తు పానీయాలకు అలవాటు పడి నేరగాళ్లుగా మారుతున్నారని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా స్కూల్ బస్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిజ్ బెత్, ఎస్సై లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది ఎ.శ్రీనివాస్, యాకయ్య, శ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి



బచ్చన్నపేట: ప్రభుత్వ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటాలని మండలంలోని కొడవటూర్, కట్కూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బ్యుంగి రూపాచైతన్య, ప్రశాంత్ ఆచార్య అన్నారు. గురువారం గ్రామాల్లో మొక్కలను ఇంటింటా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లి ఉన్నత పాఠశాలలో 2008-09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం అదే పాఠశాలలో కలుసుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఒకే చోట చేరి చిన్న నాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గురువులు తాళ్లపల్లి లక్ష్మణ్‌గౌడ్, సీహెచ్ అంబేడ్కర్, బి.శ్యాంసుందర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, రాజయ్య, సుద్దాల యాదగిరిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ప్యారాల అనిల్, దైతల రంజిత్, పరుశరాములు, కుమార్‌గౌడ్, హరి, శివగౌడ్, ప్రశాంత్, తిరుపతి, రాజు, రాజశేఖర్, సంపత్, కమలాకర్, కిషన్, రోహిత్, ప్రసాద్, దీపిక, సునీత, అనూష, మౌనికారెడ్డి, శిరీష సంధ్య, పల్లవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో తనిఖీ



లింగాలఘణపురం: విద్యార్థులు తింటున్న టిఫిన్ రుచి చూస్తున్న తహసీల్దార్ వినయలత



బచ్చన్నపేటలో..

లింగాలఘణపురం: మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో గురువారం తహసీల్దార్ వినయలత, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తింటున్న టిఫిన్‌ను తహసీల్దార్ స్వయంగా రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందజేయాలని స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణను ఆదేశించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, వంట సరుకులను, రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకంబరీ ఉత్సవాలు



శాకంబరీ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



శాకంబరీ అలంకరణలో శివలింగం, అమ్మవారు

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో నాగేశం మహాదేవ ఆలయంలో ద్వాదశి పురస్కరించుకొని శ్రీరామదాసు భజన మండలి, టీఎస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో శివలింగంతోపాటు దేవతావిగ్రహాలకు పండ్లు, కూరగాయలతో అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకం పూజలతో శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ, శ్రీరామదాసు భజన మండలి తెలుగు రాష్ట్రాల సేవా సొసైటీ అధ్యక్షుడు మాన్యపు సిద్దేశ్వర్, భజన మండలి అధ్యక్షుడు మలీపెద్ది నరసయ్య, పట్వారి శేఖర్, కొమురగాని పద్మ, శ్రీ భగవద్గీత భజన మండలి అధ్యక్షుడు శ్రీనివాస్, చెరుకు రవి, శ్రీ కంట మహేశ్వర భజన మండలి అధ్యక్షుడు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన గాదెపాక శ్వేతను బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలుగా నియామకమయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరుట్ల దశమంత్‌రెడ్డి నియామక పత్రాన్ని ఆమెకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్వేత విలేకరులతో మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలుగా నియమించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, పార్టీ జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగేష్‌గౌడ్, ఎండీ వలిపాష, గాదెపాక చిరంజీవి, రాజు, ఎస్.రమేష్ ఉన్నారు.

శివునిపల్లి ఆటోయూనియన్ ఎన్నిక



ఎన్నికైన ఆటోయూనియన్ నూతన కమిటీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో గెస్ట్ హౌజ్ అడ్డాకు సంబంధించిన ఆటోయూనియన్‌ను గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గజవెల్లి దయాకర్, గౌరవ అధ్యక్షుడిగా బూట్ల వెంకన్న, ఉపాధ్యక్షుడు కడుదూరి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగోజు పరమేశ్, కార్యదర్శి తాళ్లపెల్లి వెంకన్న, కోశాధికారి కూరపాటి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కమిటీ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ ఆటోయూనియన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చంద్రమౌళి, నరేష్, షబ్బీర్, అంజయ్య, సోమయ్య, యాదగిరి, శ్రీకాంత్, రాజు, జ్యోతి, రజినీకాంత్, వెంకటేశ్వర్లు, కోదండపాణి, స్వామి తదితరులు పాల్గొన్నారు.